క్లుప్తంగా

కొలతల ప్రకారం పనులు చేయాలి



పులకుర్తిలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ మోదీన్‌బాషా

కోడుమూరు రూరల్ : ఉపాధి కూలీలు ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పని చేయాలని కోడుమూరు ఏపీఓ మోదీన్‌బాషా సూచించారు. మంగళవారం మండలంలోని పులకుర్తి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీఓ తనిఖీ చేశారు. కూలీల హాజరు, మస్టర్లను పరిశీలించారు. ఏపీఓ మాట్లాడుతూ మండుతున్న ఎండల దృష్ట్యా కూలీలంతా ఉదయాన్నే పనుల్లోకి వచ్చి త్వరగా పనులు పూర్తి చేసుకుని వెళ్లాలన్నారు. ప్రతి కూలీ వందరోజుల పనిదినాలు పూర్తి చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజువారీ వేతనం రూ.272 పడుతుందన్నారు.

చురుగ్గా సాగుతున్న రోడ్డు నిర్మాణ పనులు



పోలకల్ దగ్గర రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్న కూలీలు

సి.బెళగల్: మండలంలోని పోలకల్ నుంచి ముడుమాల గ్రామం వరకు చేపట్టిన ఆర్ అండ్ బీ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దాదాపు నాలుగు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.25 కోట్లను ప్రభుత్వం మంజూరవ్వగా గత నెలలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేతలు మండల నాయకులతో కలిసి పనులను పూజచేసి ప్రారంభించారు. ఈ మేరకు మంగళవారం రోడ్డు పనులను సి.బెళగల్ మండల వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ నరసింహుడు, మండల నాయకులు పులిరాజు, బాలరాజు, సోమప్ప తదితరులు పనులు పరిశీలించారు.

నాణ్యత పాటించాలి

సి.బెళగల్: ప్రభుత్వ భవనాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ, ప్రహరీల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలని ఎంపీడీఓ శకుంతల సూచించారు. మంగళవారం మండలంలోని ఈర్లదిన్నె, ముడుమాల, కొండాపురం, గుండ్రేవుల, పోలకల్ గ్రామాలలో ఈఓఆర్డీ సందీప్‌తో కలిసి ఎంపీడీఓ పర్యటించారు. ఆయా గ్రామాలలో సచివాలయ భవనాలను, ఆర్బీకే నిర్మాణాలను పరిశీలించారు. అదేవిధంగా కొండాపురంలో రూ.10 లక్షల జెడ్పీ నిధులతో చేపట్టిన ప్రహరీ నిర్మాణాన్ని పరిశీలించారు.


కర్ణాటక మద్యం పట్టివేత

కోడుమూరు రూరల్: కర్ణాటక మద్యం 9కేసులను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ రామాంజినేయులు తెలిపారు. కోడుమూరు సెబ్ స్టేషన్ పరిధిలోని సి.బెళగల్ మండలం బ్యాతోలి గ్రామం నుంచి పోలకల్ గ్రామానికి వెళ్లే పొలాల రస్తాలో సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై రెండు సంచుల్లో కర్ణాటక మద్యం తరలిస్తుండగా సిబ్బందితో దాడులు నిర్వహించి పట్టుకున్నామన్నారు. మద్యం తరలిస్తున్న వ్యక్తులు పారిపోగా మద్యాన్ని, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు. దాడుల్లో కోడుమూరు సెబ్ ఎస్‌ఐ అలీబేగ్, సిబ్బంది హనుమంతు, విరుపాక్షిరెడ్డి, వెంకటేష్ నాయక్, అన్వర్ బాషా పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్‌సీపీకి ఉల్చాల గ్రామ పెద్దలు మద్దతు

కర్నూలు కల్చరల్ : కర్నూలు మండలం ఉల్చాల గ్రామానికి చెందిన పెద్దలు సత్యపాల్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రాజారెడ్డి, శ్యామ్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, మాజీ సర్పంచు ఇసాక్ , వడ్ల రాజశేఖర్, బోయ మౌలాలి తదితరులు కుడా చైర్మన్ కోట్ల హర్షవర్దన్ రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి తమ మద్దతు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపునకు తమ వంతు కృషి చేస్తామన్నారు.

ఉత్సాహంగా ఆటో రివర్స్ పోటీలు



ఆటో రివర్స్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: మండలంలోని ఎన్ కొంతలపాడు గ్రామంలో ఆటో రివర్స్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. సీఐటీయూ జిల్లా నాయకులు శ్రీధర్ ప్రారంభించిన ఈ పోటీల్లో లొద్దిపల్లె గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్లు ఇమ్మానుయేలు ప్రతిభను కనపరిచి మొదటి బహుమతి రూ.5016 సాధించగా, అదే గ్రామానికి చెందిన సుధాకర్ రూ.3016, నవీన్ రూ.2016 చొప్పున వరుసగా మూడు బహుమతులు గెలుచుకున్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ మండల నాయకులు గోరంట్ల, నారాయణ, స్వాములు, నాగేషులు, మల్లి, మధుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం దిశగా అడుగులు!

పంచాయతీల్లో వేగంగా పన్నుల వసూళ్లు

- మొత్తం వసూలు చేయాల్సింది రూ.36.55 కోట్లు
- ఇప్పటి వరకు వసూలు చేసింది రూ.18.73 కోట్లు
- ఈ నెలాఖరు నాటికి టార్గెట్ చేరుకునేందుకు అధికారుల చర్యలు
- ఇటీవలే దిశా నిర్దేశం చేసిన పీఆర్ అండ్ ఆర్‌డీ కమిషనర్



కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పేద, మధ్య తరగతి వర్గాలకు ఆయా పథకాల ద్వారా అందుతున్న ఆర్థిక సహకారం ... తదితర కారణాలతో జిల్లాలోని మెజారిటీ గ్రామ పంచాయతీల్లో పన్నులు వేగంగా వసూళ్లవుతున్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి పన్నుల వసూలులో నిర్ణయించిన లక్ష్యాన్ని చేరుకోవడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో జిల్లాలోని 484 గ్రామ పంచాయతీల్లో ఇప్పటి వరకు 50 శాతం పన్నులు, పన్నేతరములు వసూలయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే గ్రాంట్లకు అనుబంధంగా ... స్థానిక వనరులను సమీకరించుకోవడం, పన్నులు వసూలు చేయడంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందనే భావనతో మెజారిటీ పాలకవర్గాలు పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాయి. అన్ని గ్రామ పంచాయతీల్లో పన్నులు, పన్నేతరములపై దృష్టి సారిస్తే ఆయా గ్రామ పంచాయతీ ఖాతాల్లో నిధులు జమ అయ్యే అవకాశాలు ఉంటాయనే అధికారులు చేసిన సూచనలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. పన్నుల వసూళ్లకు సంబంధించి డివిజన్ల వారీగా లక్ష్యాలను కేటాయించడం, పంచాయతీ కార్యదర్శులు, ఈఓఆర్‌డీలకు ప్రత్యేకంగా బాధ్యతలు అప్పగించారు. అలాగే డీపీఓ కార్యాలయంలో ప్రత్యేకంగా ప్రతి రోజు పర్యవేక్షణ ఏర్పాటు చేయడం వల్ల పన్నుల వసూళ్లలో ప్రగతి కనిపిస్తోంది. పన్నుల వసూళ్లకు సంబంధించి ఇటీవల పీఆర్ అండ్ ఆర్‌డీ కమిషనర్ కన్నబాబు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశా నిర్దేశం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి వంద శాతం పన్నుల వసూళ్లే లక్ష్యంగా పని చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే క్షేత్ర స్థాయిలోని కార్యదర్శులు, ఈఓఆర్‌డీ, డీఎల్‌పీఓలు పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు.

సర్పంచుల పాత్ర కీలకం ...

గ్రామ పంచాయతీ పరిధిల్లో పన్నులను వసూలు చేయడం, వాటిని అభివృద్ధి పనులకు వెచ్చించుకునే విషయంలో గ్రామ సర్పంచులది కీలకపాత్ర. ఆయా గ్రామ పంచాయతీల్లో పన్నుల రూపంలో వచ్చే ఆదాయాన్ని పూర్తిగా గ్రామాభివృద్ధి కోసం వెచ్చించుకునే సౌలభ్యం ఉంది. అయినా ... వివిధ గ్రామాల సర్పంచులు పన్నుల వసూళ్లపై పెద్దగా దృష్టి సారించనట్లు తెలుస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘం, ఇతర గ్రాంట్ల పైనే గ్రామ పంచాయతీ పాలకవర్గాలు దృష్టి కేంద్రీకరించాయే తప్ప స్థానిక వనరుల నుంచి పంచాయతీలకు వచ్చే ఆదాయాల గురించి పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామ పంచాయతీల్లో పన్నులు(ఇంటి పన్ను, లైబ్రరీ సెస్సు, కుళాయి పన్ను) పన్నేతరముల (మార్కెట్ వేలాలు, షాపింగ్ అద్దెలు, లైసెన్స్ ఫీజులు, కుళాయి ఫీజులు, భవన నిర్మాణ ఫీజులు) రూపంలో సొంత వనరులను సమీకరించుకోవడంలో సర్పంచులు తమ పాత్రను పోషించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆదాయం పెంపుపై ప్రత్యేక దృష్టి అవసరం

అనేక గ్రామ పంచాయతీల్లో దశాబ్దం క్రితం ఉన్న ఇళ్ల సంఖ్యనే నేటికి లెక్కల్లో చూపుతున్నారు. జిల్లాలోని 484 గ్రామ పంచాయతీల్లో దాదాపు 50 శాతం గ్రామ పంచాయతీలు భౌగోళికంగా విస్తీర్ణం చెందాయి. ఈ నేపథ్యంలోనే ఆయా గ్రామ పంచాయతీల్లో కొత్త కాలనీలు ఏర్పాటయ్యాయి. అయితే కొత్తగా గ్రామ శివారుల్లో ఏర్పాటవుతున్న కాలనీలు, కొత్త ఇళ్లపై సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడం వల్ల ఆయా గ్రామ పంచాయతీలు ప్రత్యక్షంగా పన్నుల రూపంలో వచ్చే ఆదాయాన్ని కోల్పోతున్నాయనే విమర్శలు కూడా ఉన్నాయి.

- మద్దికెర గ్రామ పంచాయతీలో పన్నులు, పన్నేతరములు కలిపి మొత్తం రూ.81,33,157 వసూలు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ.68,99,241 వసూలు చేశారు.
- కోడుమూరు గ్రామ పంచాయతీలో రూ.1,79,26,291లకు గాను రూ.1,39,26,933 వసూలు చేశారు.
- గోనెగండ్ల పంచాయతీలో రూ.40,74,769కు ఇప్పటి వరకు రూ.21,76,311 వసూలయ్యాయి.
- పై గ్రామ పంచాయతీలు పన్నుల వసూళ్లలో ప్రగతికి కొన్ని ఉదాహరణలు మాత్రమే. జిల్లాలో మెజారిటీ గ్రామ పంచాయతీల్లో అదే స్థాయిలో పన్నులు వసూళ్లవుతున్నాయి.

జిల్లాలో మొత్తం గ్రామ పంచాయతీలు ...	484
మేజర్ గ్రామ పంచాయతీలు ...	16
మైనర్ గ్రామ పంచాయతీలు ...	468

ఏప్రిల్ 1వ తేది నాటికి వసూలు లక్ష్యం (అరియర్స్‌తో కలిపి)

పన్నులు :	రూ. 28,26,33,111
పన్నేతరములు :	రూ 8,29,26,528
మొత్తం:	రూ. 36,55,59,639
వసూలు చేసింది ...	
పన్నులు :	రూ.13,91,95,060
పన్నేతరములు :	రూ. 4,81,47,180
మొత్తం:	రూ.18,73,42,240

కోట్ల వర్గం మద్దతు మనకొద్దు !

కోడుమూరు : టీడీపీలో వర్గపోరు ముదురుతోంది. విష్ణువర్దన్‌రెడ్డిని నమ్ముకుని వచ్చిన వాళ్లే నా మనషులు.... కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డి వర్గం పేరుతో వస్తే తన వద్దకు రావద్దంటూ టీడీపీ నేత ఎదురూరు విష్ణువర్దన్‌రెడ్డి కోడుమూరు నియోజకవర్గంలోని టీడీపీ నేతలకు, కార్యకర్తలకు తెగేసి చెబుతున్నారు. కోడుమూరు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా బొగ్గుల దస్తగిరి ఎంపికై నెలరోజులైనా ఇంతవరకు కోట్ల సూర్య వర్గానికి చెందిన నాయకులను కలవలేదు. వారు వస్తామన్నా... విష్ణువర్దన్‌రెడ్డి కలుపుకుని పని చేసే పరిస్థితుల్లో లేరు. కోట్ల సూర్య వర్గానికి చెందిన నేతల స్థానంలో ఇతరులను తయారు చేసుకునే ఆలోచనతో విష్ణువర్దన్‌రెడ్డి ముందుకు సాగుతున్నాడు. గ్రామాల్లో అల్లరిమూకలను, అసాంఘిక కార్యకలాపాలకు అలవాటుపడిన వారిని టీడీపీ నేతలుగా ప్రోత్సహిస్తున్నారు. విష్ణువర్దన్‌రెడ్డి కోట్ల సూర్య వర్గాన్ని పట్టించుకోకుండా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండడంతో నియోజకవర్గంలోని కోట్ల వర్గీయులంతా ఏకమవుతున్నారు. ఇటీవల కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డి తన వర్గానికి సంబంధించిన వారినందరిని పిలిపించుకుని అధిష్టానం నుంచి సరియైన నిర్ణయం, సరియైన సమాధానం రాకపోతే నాయకులంతా మీకు తోచిన ఆలోచన చేసుకోండని చెప్పడంతో కోట్ల వర్గీయులంతా కొంతకాలంగా స్తబ్దుగా ఉన్నారు. దశాబ్దాల కాలంగా టీడీపీని నమ్ముకుని పనిచేస్తున్న వీరంతా సొంత ఏజెండాతో నడుస్తున్న విష్ణువర్దన్‌రెడ్డికి ఎన్నికల్లో సహకరించేది లేదంటూ ప్రకటిస్తున్నారు. అవసరమైతే ప్రత్యర్థి పార్టీకి పనిచేస్తాంగాని, నియంతలా వ్యవహరిస్తున్న విష్ణువర్దన్‌రెడ్డికి సహకరించేది లేదని తెగేసి చెబుతున్నారు కోట్ల వర్గీయులు.

వైఎస్ జగన్‌కు అండగా నిలవండి



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటరును అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- ప్రభుత్వం చేసిన మేలు మరువొద్దు
- ప్రతిపక్షాలకు ఓటుతో బుద్ధి చెప్పాలి
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ప్రజా సంక్షేమానికి అహర్నిశలు శ్రమిస్తున్న వైఎస్ జగన్‌కు అండగా నిలవాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. మంగళవారం కల్లూరు అర్బన్ 33, 41వ వార్డుల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలకు ఓటుతో గుణపాఠం చెప్పాలని కోరారు. వైఎస్సార్‌సీపీ పాలనలో చేకూరిన మేలును ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలన్నారు. సంక్షేమాన్ని ఇంటి ముగింటకే తెచ్చామన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలైనా వైఎస్ జగన్ మాదిరిగా ప్రజల దగ్గరకు పాలనను తీసుకొచ్చాయా అని అడిగారు. మీరు వివిధసేవల కోసం మండల కేంద్రాలకు వెళ్లకుండా సచివాలయ, వలంటీర్ వ్యవస్థ తీసుకొచ్చిన వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని ఓటర్లను కోరారు. త్వరలో వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో విడుదలవుతుందన్నారు. అందులో రెట్టింపు సంక్షేమం ఉంటుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కర్రెమ్మ దేవర



అమ్మవారిని దర్శించుకుంటున్న కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ సతీష్



బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

సి.బెళగల్: మండలంలోని ముడుమాలలో మూడేళ్లకోసారి నిర్వహించే గ్రామ దేవత కర్రెమ్మ దేవర మంగళవారం వైభవంగా జరిగాయి. సోమవారం రాత్రి అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించి మంగళవారం తెల్లవారుజామున ఆలయానికి చేర్చారు. భక్తులు బోనాలతో పెద్ద ఎత్తున ఆలయం చేరుకుని అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

అమ్మవారిని దర్శించుకున్న నాయకులు

కర్రెమ్మ దేవరను పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోడుమూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ అమ్మవారిని దర్శించుకున్నారు. అదేవిధంగా వైస్ ఎంపీపీ నాయకంటి మంగమ్మ, గ్రామ పెద్దలు రవి ప్రకాష్ రెడ్డి, మద్దిలేటి తదితరులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులను చెలించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి, మాజీ కన్వీనర్ నరసింహుడు, మండల కార్యదర్శులు బాయికటి మద్దిలేటి, ముందరింటి వెంకటేష్, గోపాల్, శంకర్‌రెడ్డి, పులిరాజు, నాగేశ్వర రెడ్డి, రంగారెడ్డి, నాగరాజు, ఎంపీటీసీ సభ్యులు నడిపి సోమన్న, మణిమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కుటుంబాలు



బ్రాహ్మణదొడ్డి వాసులకు వైఎస్సార్‌సీపీ కండువ కప్పుతున్న డాక్టర్ సతీష్, కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

సి.బెళగల్: మండల పరిధిలోని బ్రాహ్మణదొడ్డి గ్రామానికి చెందిన టీడీపీ పెద్దలు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు మంగళవారం వైఎస్‌ఆర్‌సీపీలో చేరారు. కర్నూలులోని క్యాంప్ ఆఫీస్‌లో కోడుమూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోడుమూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ సమక్షంలో 50 బీసీ సామాజిక వర్గానికి చెందిన కుటుంబాల సభ్యులు వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు. గ్రామానికి చెందిన చిన్నరాముడు, మేకల రాముడు, వెంకటేశ్వర్లు, వడ్డే శివ, నాగేష్, చిన్న పాంటయ్య, వడ్డే రాముడు, చిన్న వెంకటేష్, వడ్డే రాముడు, కృష్ణ తదితరులకు డాక్టర్ సతీష్, కోట్ల హర్షవర్ధన్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులు మాట్లాడుతూ సీఎం జగన్న చేపట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై గ్రామ అభివృద్ధికి వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సోమశేఖర్, గ్రామ సర్పంచ్ దస్తగిరి, నాయకులు ఎల్లాక్రిష్ణ, మౌలాలి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గర్భిణి ఆస్పత్రిలో ప్రసవమయ్యేలా చూడాలి

- జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్



కోడుమూరులో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డా.ప్రవీణ్‌కుమార్

కోడుమూరు రూరల్ : ప్రతి గర్భిణి ప్రభుత్వ ఆస్పత్రులలో సుఖ ప్రసవమయ్యేలా చూడాల్సిన బాధ్యత ఆరోగ్య, ఆశా కార్యకర్తలదేనని జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని లద్దగిరి పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో ల్యాబ్, ఫార్మసీ స్టోర్స్, వ్యాక్సిన్లు నిల్వ ఉండే శీతలీకరణ కేంద్రాలను పరిశీలించారు. అదేవిధంగా వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం కోడుమూరులోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని డా.ప్రవీణ్‌కుమార్ సందర్శించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పట్టణ, ప్రాథమిక, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, 108,104,102లలో రాజకీయ నాయకులకు సంబంధించిన ఫొటోలు తొలగించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కోడుమూరు లోకేటెడ్ వైద్యాధికారి డాక్టర్ మాదన్న, వైద్యులు డాక్టర్ భాస్కర్, డాక్టర్ జయంతి, సీహెచ్‌ఓ శాంత, ఎంపీహెచ్‌ఓ నరసప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలి

- వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పాణ్యం నియోజకవర్గ ఎన్నికల అధికారి జేసీ మౌర్య

కర్నూలు(సెంట్రల్) : ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని పాణ్యం నియోజకవర్గ ఎన్నికల అధికారి/జేసీ నారపురెడ్డి మౌర్య కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై ఆమె గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పాణ్యం నియోజకవర్గంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు మధ్య ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40 లక్షల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అభ్యర్థి రోజువారీగా చేసిన ఖర్చు వివరాలను తమకు ఏ రోజుకు ఆ రోజే పంపాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు ప్రచారంలో వినియోగించే బ్యానర్లు, జెండాలు, టోపీలు, వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహించే ప్రకటనలకు సంబంధించి కూడా రేటింగ్ కార్డు ఇస్తామన్నారు. మొదట సంబంధిత రేటింగ్ ప్రకారం అనుమతి తీసుకొని దాని ప్రకారమే ఖర్చు చేయాలన్నారు. అభ్యర్థులు సభలు, సమావేశాలు నిర్వహించాలనుకుంటే 48 గంటల ముందే అనుమతులు తీసుకొని నిర్వహించుకోవాలన్నారు. ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్ , వీడియో వ్యూయింగ్ బృందాలు నియోజకవర్గంలో పర్యటిస్తూ అభ్యర్థుల ఖర్చులపై నిఘా వేసి ఉంటాయన్నారు. అనంతరం ఆన్‌లైన్‌లో అనుమతులు పొందే వివిధ యాప్‌లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాజకీయ ప్రతినిధులకు తెలియజేశారు. కాగా, ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్ , వీడియో వ్యూయింగ్ బృందాల్లోని సభ్యులు రాజకీయాలకు అతీతంగా ఎన్నికల విధులు నిర్వహించాలన్నారు. నియోజకవర్గంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన కొన్ని చోట ఉన్న రాజకీయ పార్టీల హోర్డింగ్‌లను తొలగించడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఓర్వకల్లు, పాణ్యం తహసీల్దార్లు నటరాజు, ఫణికుమార్, రాజకీయ పార్టీల నుంచి టీడీపీ తరఫున ప్రశాంత్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ తరఫున సురేష్, సీపీఎం తరఫునన రామకృష్ణ, బీఎస్పీ తరఫున చిరంజీవి పాల్గొన్నారు.

కేజీ రోడ్డులో ట్రాఫిక్ జామ్

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు - గుంటూరు జాతీయ రహదారిపై వెంకాయపల్లె ఆలయ సమీపంలో మంగళవారం ట్రాఫిక్ స్తంభించింది. మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 8గంటల వరకు రోడ్డుపై వందల వాహనాలు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో ఓ వైపు అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులు, మరో వైపు ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. వేణుగోపాలస్వామి ఆలయం వద్ద కల్వర్టు నిర్మాణం జరుగుతుండటం, మరోవైపు వాహనదారులు రెండువైపుల నుంచి ఎదురెదురుగా రావడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. విషయం తెలుసుకున్న కర్నూలు తాలూకా పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



కేజీ రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

నేడు బురాన్‌దొడ్డిలో ఉరుసు

సి.బెళగల్: మండల పరిధిలోని బురాన్‌దొడ్డి గ్రామంలో వెలసిని శ్రీ గోకారమయ్య ఉరుసు ఉత్సావాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా రాత్రి కేవీ కిరణ్ కుమార్ ఇంటి నుంచి గంధాన్ని భక్తి శ్రద్ధలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. వేకువజామున శ్రీ గోకారమయ్య దర్గాకు చేరుకోవటం జరుగుతుందని నిర్వాహకులు శరత్ తెలిపారు. బుధవారం ఉరుసు ఉంటుందని, గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొనాలని గ్రామ పెద్దలు కోరారు.

ఓటర్లను ప్రభావితం చేసే ప్రకటనలు ఉండరాదు

పాణ్యం: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో గ్రామాల్లో ఓటర్లను ప్రభావితం చేసే ప్రకటనలు, రాజకీయనాయకుల ఫొటోలు , ప్రచార హోర్డింగ్‌లు ఉండకూడదని ఎంపీడీఓ భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె గ్రామాల కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

22న వేలం పాటలు

గడివేముల: మండల కేంద్రం గడివేములలో మూలపెద్దమ్మ అమ్మవారి జాతర సందర్భంగా తలనీలాల సేకరణకు ఈ నెల 22న బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఈఓ మోహన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.10 వేలు డిపాజిట్ చేయాలన్నారు. జాతర ప్రారంభం నుంచి నెల రోజుల పాటు తలనీలాలు పోగు చేసుకోవచ్చన్నారు. అదే విధంగా మిశ్రమ బియ్యం, బేడలు కొనుగోలు చేసుకునేందుకు ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనాలన్నారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

పాణ్యం: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ని వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిని ప్రతాప్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై మంగళవారం ఆర్ఐ మహేశ్వర రెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విగ్నేష్ అనే బీకాం ఫస్ట్ ఇయర్ విద్యార్థి పట్ల అధ్యాపకుడు దురుసుగా ప్రవర్తించాడన్నారు. కార్యక్రమంలో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ వెంకటాద్రి, మరియు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తు చేసుకోండి

పాణ్యం: పాణ్యం డిగ్రీ కళాశాలో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసేందుకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సింహాద్రి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జువాలజీ (జంతుశాస్త్రం), ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆయా సబ్జెక్టుల్లో 55శాతం మించి మార్కులు కలిగి ఏపీసెట్ ఎన్‌ఈటీ లేదా పీహెచ్‌డీ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

- సజావుగా నిర్వహించేందుకు సహకరించాలి
- డీఎస్పీ విజయశేఖర్



పోలకల్లో ప్రజలు, నాయకులతో మాట్లాడుతున్న డీఎస్పీ విజయశేఖర్

సి.బెళగల్: ఎన్నికల నియమ నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ హెచ్చరించారు. మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో రెగ్యులర్, స్పెషల్, మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను మంగళవారం డీఎస్పీ పరిశీలించారు. అదేవిధంగా గొల్లలదొడ్డి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి వసతుల వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ పరిస్థితులు, పోలింగ్ స్టేషన్ల వివరాలను గ్రామ సచివాలయాల ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాలలోని ప్రజలు, నాయకులతో డీఎస్పీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ప్రతిఒక్కరూ సమన్వయంతో మెలగాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా ప్రయాణికులు, విద్యార్థులతో ఎన్నికల నిర్వహణ, ప్రయాణ జాగ్రత్తలు, చదువు ప్రాముఖ్యతను డీఎస్పీ వివరించారు. డీఎస్పీ వెంట కోడుమూరు సీఐ మనుసూరుద్దీన్, స్థానిక ఎస్ఐ తిమ్మారెడ్డి, ఏఎస్ఐ నాగయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

డీజేల నిర్వహణకు అనుమతులు తప్పనిసరి

సి.బెళగల్: డీజేల నిర్వహణకు అనుమతులు తప్పనిసరి అని ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన డీజే నిర్వాహకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో నిబంధనలు పాటించాలని సూచించారు. ఎన్నిల ప్రచారాలు, వివాహ వేడుకలు, ఊరేగింపు, సంబరాలకు తదితర వేడుకలు రాత్రి 9 గంటలలోపు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ సూచించారు. అనుమతులు లేకుండా డీజే సౌండ్ సిస్టంటమ్స్‌ను ఏర్పాటు చేసినా, ఎన్నికల నియమావళిని అతిక్రమించినా కఠిన చర్యలు తప్పవని డీజీ నిర్వాహకులను ఎస్ఐ హెచ్చరించారు.

పది పరీక్షలకు 17 మంది గైర్హాజరు



కొత్తకోట పరీక్షల కేంద్రం దగ్గర వివరాలను తెలుసుకుంటున్న ఎంపీడీఓ శకుంతల

సి.బెళగల్: మండలంలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షలకు మంగళవారం 17 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ఆయా కేంద్రాల డిపార్టుమెంటల్ అధికారులు కిష్టన్న, కేశవనాథ్, సునీల్ రాజు, సత్యనారాయణ తెలిపారు. హిందీ పరీక్షకు కొత్తకోట జెడ్పీ హైస్కూల్లోని ఏ సెంటర్‌లో నలుగురు, బీ సెంటర్‌లో ఇద్దరు, ఏపీ మోడల్ స్కూల్లో ముగ్గురు, సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్లో ముగ్గురు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులంలో నలుగురు చొప్పున గైర్హాజరయ్యారని చెప్పారు. అదేవిధంగా కొత్తకోట జెడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రాలను ఎంపీడీఓ శకుంతల, ఈఓఆర్డీ సందీప్ పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు.

పది పరీక్షలకు 14 మంది విద్యార్థులు గైర్హాజర్

కోడుమూరు రూరల్ : పదవ తరగతి పరీక్షలకు మంగళవారం 14మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని కోడుమూరు ఎంఈఓ వసంతలక్ష్మి తెలియజేశారు. కోడుమూరులోని బాలురు, బాలికల హైస్కూల్ ఏ,బీ, మోడల్ స్కూల్‌తో పాటు, లద్దగిరి హైస్కూల్, గోరంట్ల రెసిడెన్షియల్ పాఠశాల పరీక్షా కేంద్రాల్లో 1186మంది విద్యార్థులకుగాను, 1172మంది హాజరయ్యారని చెప్పారు.

'పది'పరీక్షకు 24 మంది గైర్హాజరు

ఓర్వకల్లు: మండలంలోని వివిధ పరీక్ష కేంద్రాల్లో మంగళవారం జరిగిన హిందీ పరీక్షకు 24 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ-2 ఓంకార్ యాదవ్ తెలిపారు. రెండో రోజు ఐదు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన హిందీ పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులతో పాటు, ప్రైవేట్ విద్యార్థులు కలిపి మొత్తం 993 మందికి గాను 969 మంది హాజరైనట్లు ఆయన వెల్లడించారు.

రెండు టిప్పర్లు సీజ్

కర్నూలు (న్యూటౌన్): మండల పరిధిలోని ఎదురూరు గ్రామం సమీపంలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న రెండు టిప్పర్లను మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. గ్రామం సర్వే నంబర్ 126లో అక్రమంగా గ్రావెల్ తవ్వి తరలిస్తున్నారని సమాచారం రావడంతో దాడి చేసి పట్టుకున్నట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. సీజ్ చేసిన టిప్పర్లను కర్నూలు ఆర్టీసీ డిపోలో పెట్టామన్నారు. తనిఖీల్లో జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసిన జిల్లా మైనింగ్ అధికారులు